# కోనసీమలో కనిపించిన ఆమెకోసం సంవత్సరాలుగా అతనెందుకు నిరీక్షించాడు?

## రాందేవ్ కథ

# వెన్నెల్లో గోదారి

కోనసీమ పేరు చెబితే పరవశించి పోతాడు మా నాన్న. గంటలు, రోజులు సరిపోవు కోనసీమ వైభవాన్ని వర్ణించడానికి ఆయనకు.

"అక్కడ నేల, గాలీ, జనం అంతా ప్రత్యేకం. రాజులు, శెట్టిబల్జీలు, కోమట్లు, బ్రాహ్మలు, పంచములు, ఒక్కొక్కళ్ళది ఒక్కో రకం మర్యాద, రాజులింట్లో ఎండవేళ వెళ్ళామనుకో చల్లటి, చిక్కటి మజ్జిగ దాహం ఇస్తారు. హాయిగా, సుఖంగా ఉంటుంది ఆ మజ్జిగ తాగితే, తినడానికి పూతరేకులు, గోరుమిటీలు. ముఖ్యంగా నాకు, వెంకటపతి రాజు, రామభద్రరాజు అంటే ప్రాణం."

రెవిన్యూ డిపార్టుమెంట్‌లో పనిచేసి రిటైరయ్యాడు మా నాన్న. సర్వీసులో వుండగా ఆ ఊళ్ళనీ తిరిగాడు. ఆయన పదేపదే కోనసీమ గురించి చెప్పినా, అక్కడ రాజులు, బ్రాహ్మలు శెట్టిబల్జీల సంగతి చెప్పినా నాకు వళ్ళు మండుతుంది. పాతకాలపు బి.ఏ ప్యాసయి రెవిన్యూ డిపార్టుమెంటులో పాతిక సంవత్సరాలు పనిచేసినా ఈ కులాల పిచ్చేమిటో ఆయనకు అనిపించేది. దేశం వేగంగా మారిపోతున్నా, ఈ కోనసీమ ఇంకా బాగా వెనకబడే ఉండాలి.

ఇంటర్మీడియెట్ పరీక్షలు మొదటి సంవత్సరం పరీక్షలు వ్రాసి ఖాళీగా ఉన్నాను. గుంటూరులో ఎండలు మండిపోతున్నాయి. ఆ సమయంలో వచ్చింది వివాహ శుభ పత్రిక. నాన్న ముఖం ఆనందంతో వెలిగింది. పాపం అంతలో నిరాశ.



"రామభద్రరాజు మనమరాలు అంజినీ కుమారి పెళ్ళిరా! వెళ్ళాలని మనసు పీకుతోంది. ఈ హైబ్లడ్ ప్రెషర్‌తో ఎక్కడికీ కదలద్దన్నాడు డాక్టర్!"

నాన్న మాటలకు అడ్డుకుంటూ అన్నాను.

"కొంపదీసి నన్ను వెళ్ళమంటావేమిటి?"

"అవును రామభద్రరాజు నాకు ప్రాణ స్నేహితుడు. ఆ ప్రాంతాల్లో బాగా పేరున్న మనిషి. కోనసీమ పెళ్ళిళ్ళు నువ్వు చూడలేదు కదూ! ఒక్కసారి అక్కడికి వెడితే జన్మలో మరిచిపోవు.."

నన్ను మరిపించడానికి, తన స్నేహితుడు మనమరాలు పెళ్ళికి నన్ను పంపడానికి ఆయన ఏదో చెబుతున్నాడని అనుకున్నాను.

గుంటూరునుండి విశాఖపట్నం వెళ్ళే పాసింజర్లో రాజమండ్రి దగ్గర దిగాను.

బస్సెక్కి గన్నవరం అక్విడక్టు దగ్గర దిగి, దిక్కులు చూస్తున్నాను. గోదావరి డెల్టాలో చిన్న చిన్న ఊళ్ళు చాలా ఉన్నాయి. నది దాటందే అక్కడికి వెళ్ళడం కష్టం. పడవ నడిపే మనిషి అనుకుంటాను. నా దగ్గరికి వచ్చి ఎక్కడికెళ్ళాలని అడిగాడు. రాంభద్రరాజుగారింటికని చెప్పాను.

"పెళ్ళికాండి రండి బాబు రండిబాబు! పడవెళ్ళి పోతాంది" అని వినయంగా అన్నాడు.

పడవకి ఎంత తీసుకుంటావని అడిగాను.

"అపచేరం... అపచేరం మీ దగ్గర కేవు తీసుకోమే" అన్నాడు.

పడవనిండా చాలా సామాను ఉంది. ఇరవై వరకు పళ్ళ అరటిగెలలు, వలభై వరకు కాయ అరటి గెలలు, పనస కాయలగుట్ట, మల్లెపూల బుట్టలు వసంతం వెళ్ళి గ్రీష్మం ప్రవేశించింది. సూర్యుడు భగ్గున మండుతున్నాడు ఆకాశంలో. దాహంగా ఉంది. వంగి గోదాట్లో నీరు నోట్లో పోసుకున్నాను. ఉప్పు కషాయం! తుపుక్కున ఉమ్మివేశాను.

"దాహంగా ఉందా బాబూ? రేవులో సెప్పంటే సోడాకాయ తీసుకువేవాళ్ళం. ఆగండి బాబూ! పుచ్చకాయ కోపిత్తాను." అని పడవవాడు కత్తితో పుచ్చకాయ కోసి పెట్టాడు.

గడపోటు వేసుకుంటూ పడవ నడుపుతున్నాడు.

పడవలో నేనొక్కడినే.

నెమ్మదిగా కదుల్తోంది పడవ.

ఆకాశంలో పచ్చని తివాసీలా, కొబ్బరి చెట్ల తలలు, నీలాకాశపుటంచుల దగ్గర ఒకటిగా మారి ఆకాశంతో కలిసిపోతున్నాయి. గోదారి గాలికి ఎండ తెలియడం లేదు. మల్లెపూల బుట్టలోనుంచి మల్లెమొగ్గ ఒకటి ఎగిరి నా దగ్గర పడింది. బొండు మల్లెమొగ్గ. అందానికి సువాసనకి ప్రకృతి మెచ్చి ఇచ్చిన కిరీటం. ఆకుపచ్చని తొడిమకు, తెల్లటి కిరీటం.

* * *

ఎన్నో పెళ్ళిళ్ళకు వెళ్ళాను గుంటూర్లో, విజయవాడల్లో. మేరేజి హాలులోనో, కళ్యాణ మండపంలోనో పెళ్ళి, మధ్యాహ్నం భోజనాలు — సాయంత్రం అయ్యేసరికి మూటా ముల్లె సర్దుకుని ఎవరి దారిన వాళ్ళు పోవడం. పెళ్ళివాళ్ళింట్లో నేనెవరో చెప్పాను. కోనసీమను, ఆ మనుషుల్ని నాన్న ఎందుకు అంతగా పొగడ్తారో అర్థమైంది. వాళ్ళ మర్యాదలకీ, ఆప్యాయతలకు ఉక్కిరిబిక్కిరయ్యాను. ఆ మధురమైన

అనుభవాన్ని మించినది నాకు ఆ రాత్రి పెళ్ళిళ్ళో ఎదురైంది.

మేళతాళాలతో ఆడపెళ్ళివారు, మగ పెళ్ళివారికి స్వాగతం చేస్తే సమయం. పెట్రోమెక్సులైట్లు డజన్లకొద్దీ వెలుగుతున్నాయి.

ఆ సమయంలో...

పన్నీరు జల్లుతూ బూక్కా విసురుతూ మెరుపు తీగలా ఆ అమ్మాయి.

ఆకుపచ్చటి పట్టు పరికిణీ. కనకాంబరం రంగు వోణీ. మల్లె మొగ్గలాంటి తెల్లటి గుండ్రటి ముఖం కాటుకు నీడన మెరిసే పెద్ద కళ్ళు. చిరుచెమటతో తడిసిన చెక్కిళ్ళు. నల్లటి వంకీల జుట్టు. పొడువైన జడ.

వర్షాకాలం ప్రతీ ఏటా వస్తుంది. వానలు పడుతూ వుంటాయి. మేఘాలతోపాటు ఉరుములు! మెరుపులు! ఏళ్ళ తరబడి జరిగే ప్రక్రియలో ఎప్పుడో పిడుగు పడుతుంది. ఏ చెట్టో పుట్టో కాలిపోతుంది. ఆ జ్వాలకు.... ఎంతమంది మా కాలేజీలో. నేను చదివిన స్కూల్లో.. అప్పుడు నాకు ఆ జ్వాల తెలియదు. పిడుగుకు కాలిపోయే జ్వాల కాదు. మనసును కాంతితో నింపే చల్లని జ్వాల — అది ఆ క్షణంలో ప్రేమజ్వాల.

పెళ్ళిలో నా కళ్ళు ఆమెనే వెతికేవి. కనబడీ మాయమయ్యే మెరుపు తీగెకు ఈమెకు తేడా తెలియదు.

నాగవెల్లి రోజు వచ్చింది. పెళ్ళి అయిదురోజులు జరిగింది. ఆ అయిదురోజులు, నాలో జ్వాలను రగిలించిన ఆమె ఎవరో తెలుసుకోలేకపోయాను.

ఏమీ తోచక నది వద్దుకు వెళ్ళాను.

రాజమండ్రినుంచి పూలబుట్టలు దిగుతున్నాయి. కనకాంబరాలు, లిల్లీపూలు, మల్లెపూలు.

బండిలోనుంచి మల్లెపూలు అందుకోవడానికి వచ్చింది ఆ అమ్మాయి.

మల్లెల మధుర సువాసన, కన్ను చెదిరే కనకాంబరాలు, పసుపు, ఎరుపు రంగుల్లో, పెద్ద లిల్లీ పూలు. ఒక్కో బుట్ట నేను దింపుతున్నాను ఆమె అందుకుంటోంది.

హఠాత్తుగా నాలో ఏదో మార్పు.

కళ్ళు తిరిగాయి.

శరీరం వశం తప్పింది.

బండిమీద నుంచి క్రింద పడుతున్న అనుభూతి... తర్వాత నాకేం తెలియదు.

* * *

కళ్ళుతెరిచాను. ఎసనకర్రతో

## మనోవర్తి



సుందరం అతని భార్యనుండి విడాకులు తీసుకోడానికి అంగీకరించాడు జడ్జి.

"అయితే మీ శ్రీమతికి నాలుగువందల రూపాయలు మనోవర్తి ఏర్పాటు చేయాలనుకుంటాను" అన్నాడు జడ్జి.

"థాంక్సు అండీ. నేను కూడా ఎంతోకొంత యిచ్చుకుంటాను" తాపీగా అన్నాడు సుందరం.

ఋషిశ్రీ (కమ్మపాలెం)

విసురుతూ ఆ అమ్మాయి.

"నాగలక్ష్మి! ఎలా ఉందమ్మా అబ్బాయికి?" రామభద్రరాజు గారి ఖంగుమనే గొంతుక.

"ఇప్పుడే తెలివొచ్చింది బాబాయ్‌గారూ!" కలభాషిణి, బంగారు తీగెల వీణెను మీటిన సన్నని, మధుర ధ్వని.

నాగలక్ష్మి!...

ఈ ప్రాంతాలలో 'నాగా' శబ్దంతో వచ్చే పేర్లెక్కువ. మెమ్మదిగా నా శరీరం స్వాధీనం అవుతోంది. "నాగలక్ష్మి గారూ! నాకేమయింది?" ఉలిక్కిపడింది నాగలక్ష్మి. బహుశా నా వయసులో వున్న పరాయి కుర్రాడు ఆమెనలా పలకరించి ఉండడు — పేరు పిలిచి.

నవ్వుతూ మళ్ళీ నేనే అన్నాను.

"నా పేరు అలకానంద.."

"అలకా! అంటే కోపం..." నాగలక్ష్మి అప్రయత్నంగా అంది.

"కోపం కొంచెం జాస్తి నాకు. కాని దాన్లో ఆనందం కూడా ఉంది. కాని మీ అంత కాదు."

ఆశ్చర్యంగా చూసి అంది నాగలక్ష్మి. "నా అంత కాదా?"

"మీరు నాగలక్ష్మి కదండీ.. కాలు తగిలినా, చెయ్యి తగిలినా బుస్సున పాములా" అని నా మాట పూర్తి చెయ్యకుండా ఆపేసి ఆమె ముఖంలోకి చూశాను.

"అదా..." అదా అని తేలిగ్గా అని "ఇవ్వాళ మీకు గండం తప్పింది. బండిమీదనుంచి దభీమని పడుతుంటే నేను పట్టుకున్నాను. ఆ ప్రక్కనే కొబ్బరికాయలు వలిచేందుకు గునపం నిలబెట్టి ఉంచారు. దానిమీద పడాల్సిన వారే! మొత్తం బరువు నాచేతిమీద పడి ఇక్కడ దెబ్బ తగిలింది."

నాగలక్ష్మి కుడిచేతి మోచేయి భాగంలో రక్తం గడ్డకట్టి నల్లగా కమిలిపోయింది.

ఆ క్షణం!

నా మనసు ఆర్ద్రమైంది. కళ్ళలో నీళ్ళు చిపిల్లాయి.

"నాగలక్ష్మి! కృతజ్ఞతలు కూడా చెప్పలేని మానసిక స్థితిలో ఉన్నాను" అని ఆమె చెయ్యి పట్టుకున్నాను. వెచ్చటి నా కన్నీటి బొట్టు ఆమె చెయ్యి దండపై పడింది.

* * *

పెళ్ళయి పెళ్ళివాళ్ళు వెళ్ళిపోయారు. ఇక అక్కడ ఉండవలసిన పని నాకు లేదు. నాగలక్ష్మిని వదిలి ఎలా వెళ్ళడం?

తోటల్లో తిరిగాం.. అమ్మగారి తీర్థానికి కలిసి వెళ్ళాం. జీళ్ళు పుచ్చకాయలు తిన్నాం. "కుంటి కులాసం" బొమ్మ వెదురు కర్రకు కట్టి తిప్పినపుడు అరటి పళ్ళతో దాని కొట్టాం.

"ఈ 'కుంటి కులాసం' బొమ్మ ప్రతీ అమ్మవారి తీర్థానికి ఇలా తిప్పుతారు. జనం దాన్ని అరటిపళ్ళతో కొడతారు. దీనికో కథ వుంది. పూర్వం బ్రిటిషు వాళ్ళ టైములోఒక మత బోధకుడు ఈ ప్రాంతానికి వచ్చాడుట. ఏ మతం వాడో తెలీదు. "మీరంతా అనాగరికులు ఏమిటీ విగ్రహారాధన? ఈ రాయి మీకు దేముడా?"

అని బోధ చేయబోయాడుట. జనానికి కోపం వచ్చింది. నచ్చచెప్పి పంపించెయ్యబోయారుట. వాడు వినలేదు. అమ్మవారి తీర్థం చెయ్యకుండా అడ్డుపడ్డాడుట. "మీరంతా అనాగరికులు. మిమ్మల్ని ఉద్ధరించడానికి ఆ భగవంతుడు నన్ను పంపాడు. ఈ విగ్రహానికి పూజ చెయ్యద్దు" అని వారించాట్ట.

విసుగెత్తిన జనం వాణ్ణి ఒక స్తంభానికి కట్టి అమ్మవారి పూజ, తీర్థం జరిపించారుట.

తీర్థానికి వచ్చిన జనం వాడికి ప్రసాదం ఇవ్వబోతే కసురుకున్నాడుట. దూరంనుంచి వాడిమీద అరటిపళ్ళు జనం విసిరేసి వెళ్ళిపోయారు.

ఆ తరువాత వాడు ఆ ఊరు వదిలి వెళ్ళిపోయాడు. స్తంభానికి కట్టి, అరటిపళ్ళు కొట్టడం ఆచారం ఇంకా అలాగే ఉంది అప్పటినుంచీ.."

ఎన్నో ఇలాటి కబుర్లు చెప్పింది. కాని, ఆ రాత్రి అనుభవం ఎన్నడూ మర్చిపోలేనిది. నిండు పున్నమి.

గోదార్లో పడవ. కరిగించిన వెండిలా వెన్నెల కురుస్తోంది. చిరుగాలికి అలలు మంద్రగా కదుల్తున్నాయి. దూరంగా గోదారొడ్డున దేవాలయంలో సాయంత్రం జరిపే పూజ తాలూకు మంత్రాలు వినీవినపడకుండా గాలి వాలుకు తేలుతూ చెవులను సోకుతోంది. వడ్డున కొబ్బరి చెట్లలో చీకటి. నదిమధ్యన నిరాటంకంగా పడే వెన్నెల. అలలలో చంద్రుడి శతకోటి రూపాలు ప్రతిబింబాలు. వేడెక్కిన గ్రీష్మహుతాసనుడు గోదార్లో మునకలు వేస్తూ తపించిన శరీరాన్ని సేద తీర్చుకుంటు న్నాడు.

పడవలో మేమిద్దరం. పడవ నడపవలసిన పనిలేదు. అలల తాకిడికి ఊగుతూ పోతూ ఉంది. అలా ఎన్నో క్షణాలు, నిమిషాలు, గంటలు వెన్నెల్లో, గోదారి అందం కన్న, నా నాగలక్ష్మి అందం ఎన్నో రెట్లు!

* * *

మర్నాడు ఊరికి బయలుదేరాను. మళ్ళీ

## హృదయం పదిలం



ప్రియుణ్ణి పొందకపోయినా అతని హృదయాన్ని మాత్రం శాశ్వతంగా పొందిన ఘనత శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన డోనా ఆష్లోక్‌కు దక్కుతుంది. ఆమె ఫెల్పేగార్జా అనే యువకుణ్ణి గాఢంగా ప్రేమించింది. అయితే చిన్నతనం నుండి డోనా గుండె బలహీనంగా ఉండేది. వారి ప్రేమ పెళ్ళికి దారి తీస్తున్న సమయంలో ఉన్నట్టుండి గార్జాకు సెరెబ్రల్ హెమరేజ్ వ్యాధి వచ్చింది. తను ఎలాగూ చనిపోవటం ఖాయం అని తెలుసుకొన్న ఆ యువకుడు తన మరణానంతరం తన గుండెను కోనాకు అమర్చమని డాక్టర్లను కోరాడు. అతడి కోరికను డాక్టర్లు తీర్చడంతో డోనా ప్రియుడి హృదయాన్ని శాశ్వతం చేసుకోగల్గింది. నిజంగా ఈ సంఘటన ప్రేమకథలలో శాశ్వత ఉదాహరణ.

జూపిటర్

వస్తావని నాగలక్ష్మికి బాసచేసి. కోనసీమ జ్ఞాపకాలు నాలో గాఢముద్ర వేశాయి. బండిమీదనుంచి మైకం వచ్చి నేను క్రిందపడ్డ సంగతి అమ్మకు చెప్పాను. కంగారు పడింది. వెంటనే డాక్టరు వద్దకు తీసుకువెళ్ళింది అమ్మ.

డాక్టరు చెప్పాడు మల్లెపూలు నాకు పడవ ని.

ఎలర్జీ!

* * *

ఇంటరు మొదటి సంవత్సరం, పరీక్ష ప్యాసయ్యాను. రెండవ సంవత్సరం క్లాసులు మొదలవలేదు.

నాగలక్ష్మిని చూడకుండా వుండలేననిపించింది. రైలెక్కి బయలుదేరాను.

తొలకరి మొదలయింది. వానలు పడుతున్నాయి.

వర్షరుతువు ప్రభావం ఎక్కువగా ఉంది. గోదారిపొంగి పొర్లుతోంది. వడ్లను తాకుతూ పోతూ ఉంది గోదారి నీరు — ఎర్రెటి జేగురురంగులో, తనతోపాటు ఆకుల్నీ, కొమ్మలల్నీ చెట్లనీ మోసుకొస్తూ ఉంది...

పడవ దిగి నడక సాగించాను— నాగలక్ష్మి ఇంటివైపు. నేలంతా బురదగా ఉంది. నన్నుచూసి నాగలక్ష్మి సంబరపడింది.

నాగలక్ష్మి కుటుంబం గురించి కొన్ని సంగతులు తెలిశాయి. కులాల పట్టింపు ఎక్కువ వున్న నాన్నకి, అమ్మకి అభ్యంతరం వుండదు. నాగలక్ష్మిని కులం పేరుతో దూరం చేసుకోనవసరం లేదు. ఆమె ఆ కుటుంబంలో రెండో సంతానం. పెద్దన్నగారు భిలాయిలో మంచి ఉద్యోగంలో ఉన్నాడు. ఇద్దరు తమ్ముళ్ళు ఇద్దరు చెల్లాయిలు. నాగలక్ష్మి స్కూలు ఫైనల్ వరకు చదువుకుంది.

ఆరోజే నాగలక్ష్మి తండ్రితో మాట్లాడాను. అన్నీ సవ్యంగా ఉన్నాయి. నా మనస్సు ఆనందంతో ఉరకలేస్తోంది. ప్రేమకు శాపం ఉంది, అది ఫలించదని అపోహ ఉంది. దానికి రుజువుగా ఎన్నో కథలు. లైలా, మజ్నూ, పారూ, దేవదా...

కాని మా కథ వేరు.

నురుగులు కక్కుతూ, పరవళ్ళు తొక్కుతూ పరవశిస్తూ ప్రవహిస్తున్న గోదార్లా ఉంది నా మనస్సు.

పడవ వచ్చేవరకు ఆగలేకపోయాను. శుభవార్త మా అమ్మకు, నాన్నకు చెప్పాలి.

* * *

ఇంటర్ క్లాసులు మొదలయ్యాయి. ఇంటర్ పరీక్షల పూర్తయితే కానీ వీల్లేదన్నారు నాన్నగారు. చదువు పూర్తయితే మంచిదని నాకు అనిపించింది.

సెప్టెంబరు వరకు మళ్ళీ నాగలక్ష్మిని చూడడం పడలేదు.

ఎంతో ఆశగా, ఉత్సాహంగా వెళ్ళిన నాకు నిరాశ ఎదురైంది. నాగలక్ష్మి ఇంట్లో లేదు. నేవస్తున్నట్లు ఉత్తరం కూడా రాశాను. అమలాపురంలో టైపు ఇన్స్టిట్యూట్‌లో చేరిందట.

ఒకరోజు అక్కడ ఉన్నాను. పిచ్చిగా గోదారి వెంబడే మైళ్ళు నడిచాను. శరదృతు

గోదారి నిండుకుండలా నిర్మలంగా ప్రవహిస్తోంది. ఆ ఉత్సాహం... ఆ దూకుడు ఆ పరవళ్ళు? ఏవీ అవి?

నిండు యవ్వనపు దశ తిరిగి మధ్య వయస్సులో కుదురుపడ్డ మనిషిలా గోదారి మెల్లగా సాగిపోతూవుంది.

మర్నాడు తిరిగొచ్చేశాను.

మళ్ళీ చదువు.. అర్థ సంవత్సర పరీక్షలు. నా ఉత్తరాలకు నాగలక్ష్మినుంచి జవాబు లేదు.

హఠాత్తుగా నాగలక్ష్మి ఎందుకిలా మారిపోయింది? వర్ష రుతువులో నిండు మనసుతో ఆహ్వానించిన నాగలక్ష్మికి శరదృతువులో ఉదాసీనంగా మారిందేం?

సంక్రాంతి సెలవుల్లో వస్తున్నాని నాగలక్ష్మికి రాశాను. జవాబు లేదు.

దిగులుగా ఆహ్వానించింది గోదారి. వయసుడిగిన తర్వాత ముఖం మీద కనపడే ముడతల్లా, చేవతగ్గిన మనిషిలోలాగ, నీరు తగ్గి, తెల్లటి ఇసుక దిబ్బలు — నున్నటి ముఖంలో మచ్చలా కనుపిస్తున్నాయి.

కత్తితో కోసే హేమంత రుతువుకు సంబంధించిన చలిగాలి కోతలు నాగలక్ష్మి నుంచి ఈ సారి ఎటువంటి స్వాగతం లభిస్తుంది? ఇంట్లో ఉంటుందా? అనుమానంగానే అడుగులు పడ్తున్నాయి. నిరాశ తీతువులా ఎక్కడో మనసులో కూస్తోంది.

గుమ్మంలో కనపడింది నాగలక్ష్మి. అంతులేని చీకటి వదనంలో నన్నో పరాయివాడిలా చూసింది. మంచు కత్తితో గుండెను ముక్కలుగా కోసినట్టు "నాగలక్ష్మి" పిలిచాను.


"ఊఁ" ఆ సమాధానంలో బరువును, బాధనూ గ్రహించాను.

బాధా?

ఎందుకు?

నాగలక్ష్మి బాధ నాతో చెప్పవచ్చుగా!

"నా ఉత్తరాలు అందుతున్నాయా?"



"ఊ"

"సమాధానం ఎందుకివ్వలేదు?"

కళ్లెత్తి చూసింది నా వైపు. కళ్ళకింద మేఘాల్లా నల్లటి మచ్చలు. ఆ పైన జలపాతాల్లా కళ్ళు.. జలపాతం క్రిందుగా మేఘాలు!

మాట్లాడలేకపోయాను.

ఏదో జరిగింది? ఏదో మిస్టరీ?

నాగలక్ష్మి నాకు చెప్పదు... నేను చెప్పించలేను... అది నా అసమర్థత.. నాకు కోపం వచ్చింది నా అశక్తతమీద. అది నాగలక్ష్మి మీద కోపంగా మారింది.

"ఏమైంది నీకు? ఎందుకు ఆకస్మాత్తుగా మారిపోయావ్? ఏం! నాకన్నా మంచివాడు దొరికాడా? నా కన్నా అందగాడు జత అయ్యాడా? మీ కోనసీమ మనుషుల్ని నమ్మకూడదు?"

ఉక్రోషంతో పిచ్చిగా వాగాను.

బాణం దెబ్బ తిన్న పాలపిట్టలా గిలగిలలాడిపోయింది నాగలక్ష్మి. క్షణాల్లో తేరుకుని అంది.

"అవును... మంచివాడు దొరికాడు. అందగాడు.. ఆరోగ్యవంతుడు.." అని ఆగి నెమ్మదిగా అంది "అతనికి ఫిట్స్ రావు.." అతనికి ఫిట్స్ రావు.. అంటే మల్లెపూల వాసన పడని నేను రోగిష్టి వాడిననే కదా! గుండెలో ఫిరంగి పెట్టి పేల్చినట్టయింది ఆ మాటతో.

'ఛీ' అని విసురుగా వచ్చేశాను.

* * *

తెగిన గాలిపటంలా ఇష్టం వచ్చినట్టు తిరిగాను. నాగలక్ష్మి దగ్గర్నుంచి వచ్చిన తర్వాత.. చదువు ఆగిపోయింది. శిశిర ఋతువులో గోదార్లో నీళ్ళుండవు. నీరు ప్రవహించదు. సముద్రపు నీరు నదిలోకి వస్తుంది. తాగడానికి పనికిరాదు. ఉప్పుకషాయం... నాగలక్ష్మి నాకు పనికి రాదు.

నాగలక్ష్మి జ్ఞాపకం వచ్చినపుడల్లా పిచ్చెక్కిపోయేది. నాగలక్ష్మి జ్ఞాపకం రాని క్షణమంటూ లేదు.

కాలేజీలోనుంచి నా పేరు తీసేశారు. నా పరిస్థితి చూసి అమ్మానాన్న ఒకటే గోల.

శిశిర ఋతువు వెళ్ళి మళ్ళీ వసంతం వచ్చింది.

అప్పుడొక వింత విషయం విన్నాను నాగలక్ష్మి గురించి.

భిలాయ్‌లో పనిచేసే ఆమె అన్న నీ కుటుంబంతో నాకే సంబంధం లేదని తెగతెంపులు చేసుకున్నాడుట. నాగలక్ష్మి తండ్రి ఎంతో ప్రాధేయ పడ్డాడుట. చెల్లెలి పెళ్ళి చేస్తావని ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. మొత్తానికే లేదంటున్నావని. ఆయన మాట వినిపించుకోలేదు. అతను...

కూలిపోతున్న ఇల్లు... అర ఎకరం భూమి... ఇల్లే మిగిలాయి

'ఈ ఇంటికి పెద్ద దిక్కువు నువ్వే నమ్మా! నీ అన్న చచ్చాడు" అన్న తండ్రి మాటను వేదవాక్కులా శిరసావహించింది నాగలక్ష్మి.

ఆపేసిన చదువు మళ్ళీ మొదలుపెట్టింది. ఇద్దరు చెల్లెళ్ళను తమ్ముళ్ళను ప్రయోజకులను, చెయ్యాలని

నిశ్చయానికొచ్చింది.

ఆ కారణం నాకు చెప్పలేదు. తన బాధ్యతలలో నాకు భారం కాకూడదని.

నా మనసు నాగలక్ష్మి మీద గౌరవ భావంతో నిండిపోయింది.

వెంటనే బయలుదేరి నాగలక్ష్మి దగ్గరకు వెళ్ళాను. ఆ ఇంటిని అమ్మేసి బ్రతుకు తెరువు వెతుక్కుంటూ వెళ్ళిపోయింది.

వాకబు చేశాను. కాకినాడలో వున్నట్టు తెలిసింది. అతి కష్టంమీద అడ్రసు దొరికింది. ఊరు శివార్లో కట్టిన కొత్తకాలనీలో ఒక గది — నాగలక్ష్మి, తండ్రీ, తమ్ముళ్ళూ, చెల్లెళ్ళు ఆ గదిలో వున్నారు.

నన్ను చూసి నవ్వింది.

వాడిపోయిన ఆమె రూపం చూసి నా కళ్ళు చెమ్మగిల్లాయి.

"నేనున్నానని మర్చిపోకు నాగలక్ష్మీ? నీ బాధ్యతలు నేనూ పంచుకుంటాను" అన్నాను.

సూటిగా నాకేసి చూస్తూ అంది నాగలక్ష్మి.

"ఆవేశంలో ప్రతిజ్ఞ చెయ్యడం సులభం. ఆచరించేటప్పుడు చాలా కష్టం అలకానంద్!"

నాకు తలకొట్టేసినట్టయింది.

"నాగలక్ష్మీ! నీకే కాదు.. నాకూ వుంది దీక్ష.. పట్టుదల.. సరే! విను... ఎన్నాళ్ళయినా, ఎన్నేళ్ళయినా, నీ కోసం ఎదురుచూస్తూ ఇలాగే వుంటా.. చూడు.." అని తిరిగొచ్చేశాను.

ఇంట్లో పెళ్ళి గురించి అమ్మపోరు ఎక్కువైంది.

ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్ క్యాంప్ మా ఊరొచ్చింది. నేనూ వెళ్ళాను.. ఎయిర్‌మెన్‌గా రిక్రూట్ అయ్యాను.

* * *

నాగలక్ష్మి జ్ఞాపకాలతో రోజులు గడుస్తున్నాయి.

ఏన్యువల్ సెలవులలో నాగలక్ష్మిని చూడ్డానికి వెళ్ళాను. పాత అడ్రసులో ఆమె లేదు.. అడ్రస్ తెలియలేదు.

ఏళ్ళు గడుస్తున్న కొద్దీ నాలో ఆశ! నాగలక్ష్మి తన బాధ్యతలు ఒక్కటొక్కటే పూర్తి చేస్తూ ఉండొచ్చు.

ఎయిర్‌మెన్, లీడింగ్ ఎయిర్‌మెన్ అయ్యాను.

## ఎరియర్స్



"ఎరియర్స్ వచ్చాయట గదా! కంగ్రాట్స్!" కిరీట్‌ను అభినందించాడు కార్తీక్

"ఆ... ఏం ఎరియర్స్? అనవసరంగా ఇన్‌కంటాక్స్ కట్టవలసి వస్తోంది." వాపోయాడు కిరీట్.

"అయితే ఎరియర్స్ నాకిచ్చెయ్ నేను టాక్సస్ కట్టేస్తా" అన్నాడు కార్తీక్. మళ్ళీ మాట్లాడలేదు కిరీట్.

—జోకర్ (హైదరాబాద్)

ఒక రోజు అద్దంలో చూసుకుంటూ క్యాప్ పెట్టుకుంటూ వుంటే చూశాను. తెల్లవెంట్రుకలు.. ఉలిక్కిపడ్డాను.

ఆరేళ్ళ తర్వాత నాగలక్ష్మి ఆచూకీ తెలిసింది. అన్నవరంలో వుంది. పెద్దచెల్లెలు పెళ్ళిచేసింది. తమ్ముళ్ళిద్దరూ స్కూలు చదువు పూర్తిచేసుకుని కాలేజీల్లో చేరారు. చూడ్డానికి వెళ్ళాను.

నాగలక్ష్మి!

పెళ్ళిలో చూసిన మల్లెమొగ్గలాటి నాగలక్ష్మేనా ఈమె.. జుట్టు సగం తెల్లబడింది. పరువంలో వుండే మెరుపేది? కళ్ళలో కాంతి బదులు అలసట తాలుకు ఆచీకట్లేమిటి?

పేలవంగా నవ్వి అంది నాతో.

"ఇంకా నా గురించి వేచివుంటావా అలకా?"

"ఎన్నాళ్ళయినా వుంటాను" అన్నాను దృఢంగా.

* * *

ఇప్పుడు కార్పొరల్ అయ్యాను. జుట్టు సగం తెల్లబడిపోయింది. 'క్రానిక్ బేచిలర్' అని నాకు ఒక నిక్‌నేమ్ వచ్చేసింది. దానికి నా దగ్గర సమాధానం లేదు.

నాగలక్ష్మి తండ్రి పోయినట్లు తెలిసింది. సెలవుల్లో వెళ్ళి చూడాలనుకుంటుండగా నాగలక్ష్మి దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది.

"అలకా! ఇప్పుడు నేను స్వేచ్ఛాజీవిని. నా బాధ్యతలు పూర్తయ్యాయి. వరద గోదారిలా పొంగుతూ రా!" అని రాసింది.

వాయు సైన్యంతో నా కంట్రాక్టు పూర్తయింది. డిశ్చార్జి తీసుకుని బయలుదేరాను. రెక్కలు విప్పి ఆకాశంలో ఎగిరిపోవాలన్నంత ఉత్సాహంగా ఉంది.

అన్నవరం వెళ్ళాను.. నాగలక్ష్మి తమ్ముళ్ళిద్దరూ ఉన్నారు.

"అక్క మా ఊరెళ్ళిపోయింది.. అక్కడే ఉంటుంది ఇక... అన్నారు"

రెక్కలు కట్టుకుని వాలాను నాగలక్ష్మి ముందు.

నేను నలభయ్యోపడిలో పడ్డాను. యవ్వనం కాలంలో కలిసిపోయింది. నేను నడివయస్కుడిని.

నాగలక్ష్మి ఇంటి ముందు ఆగాను. నూతి దగ్గర నీరు తోడుకుంటూ వుంది. బావిలోనుంచి బాల్చీ తీసి ఆయాసపడుతూ వుంది. నన్ను చూసి చిన్నపిల్లలా పరుగున వచ్చింది.

"అలకా! వచ్చేశావా?" అంది సంబరంగా!

"వచ్చేశాను.. నాగూ! కాని నువ్వు ఈ ముసలి వాడ్ని పెళ్ళాడుతావా?"

ఆమె ముఖం గంభీరంగా మారిపోయింది.

"నేను పాపిష్టిదాన్ని అలకా! నాతోపాటే నిన్నూ ఇలా చేశాను..."

మాట మారుస్తూ అన్నాను.

"నాగు మనం ఈ రోజు రాత్రి గోదార్లో పడవ ప్రయాణం చెయ్యాలి.."

గుర్తుతెలియనంత కాలం గడిచిపోయింది. ఎన్నో విశేషాలు ఎన్నో సంఘటనలు. అన్నీ మరిచిపోయాం – వెన్నెల్లో గోదారి అందం తప్ప.

గోపాలుడు కోష్టలో పాలు పితుకుతూ చంద్రుడిన్ని చూశాడు. నీలాపనిందలు పాలయ్యాడు. దానికి ప్రాయశ్చిత్తంగానేమో రాజయక్ష్మకు గురైన రాజు పాలు కురుస్తున్నాడు. కుండపోతగా పడుతున్న పాలధార చూసి గోదారి ఉప్పొంగుతోంది.

కెరటాలు చీల్చుకుంటూ పడవ సాగిపోతోంది. అప్పటి ప్రయాణానికి ఇప్పటి ప్రయాణానికి ఎంత తేడా? జీవన పయనంలో అడుగుపెట్టిన తొలి రోజులు అప్పుడు? ఎంతో దూరం వచ్చేశాం ఇప్పుడు? మాలాటి జంటల్ని ఎన్ని చూసిందో ఈ గోదారి.

ఒడ్డున కొత్తగా కట్టిన దేవాలయంలో భగవద్గీత వినపడుతోంది. గాలిలో తేలుతూ

దుఃఖేష్వనుద్విగ్నమనాః
సుఖేషు విగత స్పృహః
వీతరాగ భయ క్రోధః
స్థిత ధీర్మునిరుచ్యతే!

ఇప్పుడు సుఖాలందు ఆసక్తిలేదు. దుఃఖాలు చవిచూసి వాటికి కలత చెందడంలేదు. కోపమూ భయమూ లేవు.

నేమూ, ఆమె అనంతమైన ఆ విశ్శబ్దంలో మౌనంగానే ఉన్నాం.

ఆమె ఆలోచనలలో ఆమె. నా ఆలోచనలలో నేను.

వయస్సు మళ్ళిన ప్రేమికుల మనస్సులు శూన్యమైపోతాయా!

ఇప్పుడు మా గమ్యం ఏమిటి?

మా పెళ్ళికి ఎవరూ అడ్డుచెప్పరు?

సర్వస్వతంత్రులం మేము!

పడవ ఆగింది.

నాగలక్ష్మి దిగింది.

భారమైన గొంతుతో ఏదో అంటోంది.


మళ్ళీ పడవ కదిలింది.

అప్పటికే ఆమె మాటలు నా మస్తిష్కానికి అందాయి.

వెన్నెల్లో గోదారి జీవితంలో ఒకసారే అందంగా ఉంటుంది. మళ్ళీ... మళ్ళీ... ఆ రాత్రి రాదు...

పడవ దిగి అవతల గట్టుకు చేరాను.

గోదారి ప్రవాహం సాగిపోతూనే ఉంది.



## పత్రిక పండుగ

వార్తాపత్రికల్ని నడపడం అతి కష్టమవుతున్న ఈ తరుణంలో ఓ దిన పత్రిక రెండు వందలవ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం అత్యంత ప్రశంసనీయమైన విషయం. 1785వ సంవత్సరం జనవరి ఒకటవ తేదీన లండన్‌లో ప్రారంభమయిన ఆ దిన పత్రిక పేరు "ది టైమ్స్" ఈ దిన పత్రిక అప్పటి నుండి ఇప్పటి దాకా నిరాటంకంగా ప్రచురించబడ్తూనేఉంది. వెయ్యి ప్రతులతో ప్రచురణ ప్రారంభించిన ఈ దినపత్రిక ప్రస్తుతం నాలుగు లక్షల అరవై నాలుగు వేల కాపీలు అమ్ముడవుతోంది. మరి ఈ శుభ సమయంలో డబుల్ సెంచరీ కొట్టిన ది టైమ్స్‌కు మనం కూడా శుభాకాంక్షలు అందచేద్దాం.

—జూపిటర్